పెద్ద కథ

# మమతల పరకాయప్రవేశం

"రమణశ్రీ"

(గత సంచిక తరువాయి)

సినిమా అయిపోవడంతోనే ముగ్గురూ రిక్షా ఎక్కి ఇంటిముఖం పట్టారు. రిక్షా లైటు క్రీనీడ జాడ తప్పించి, దట్టంగా చీకట్లు ఎలక్ట్రిక్ దీపాల్ని తప్పించుకొని దయ్యాల్లా తిరుగుతున్నయ్! ఎవర్నీ లెక్కచెయ్యకండా రిక్షావాడు ముందుకు తొక్కుకుపోతున్నాడు.

ముగ్గురూ ఒకళ్ళవళ్ళో ఒకళ్లు కూర్చున్నంత ఇరుగ్గా కూర్చున్నారు. సుబ్బరామయ్య, కోటీశ్వర్రావు సన్న మనుష్యులుగనక సరిపోయింది.

సావిత్రి మౌఖికకాంతి, చెవుల స్టైప్పుల కాంతి, ముక్కు బేసరుకాంతి కలిసి, లేశమాత్ర కాంతి కళారంగాన్ని నిర్వహించి, సావిత్రి ముఖ సౌందర్య రేఖల్ని స్పష్టాస్పష్టంగా, వ్యక్తావ్యక్తంగా, క్రోడీకరించడం కోటీశ్వర్రావు దృగంతాల్ని తప్పించుకోలేకపోయింది. అరమోడ్పు కను గలువల చలువలు అవ్యాజమానంగా, కోటీశ్వర్రావు సుబ్బరామయ్యల మనోగర్వానికి కారణమైంది!

రిక్షా త్రొక్కే ఒక్క మానవుడి వగర్పులూ, ఎగపీల్పులూ, దిగపీల్పులూ తప్ప ఆ జడవాతావరణంలో మరో శబ్దేతరాలు వినిపించ పూనుకోడం లేదు. అతని చిరిగిన, మాసిన తెల్లచొక్కా శిథిల భాగాల్లోంచి అమాంసలిమైన శరీరం ఉబ్బినట్టు ఏదో నల్లనిపదార్థం రంగేసినట్టు కనిపిస్తోంది.

"కొంచెం త్వరగా పోనియ్! చల్లగాలి చంపుతోంది" అంది సావిత్రి.

రిక్షావాడు ఇదివరకటి వేగాన్ని కుంచిస్తూ, "చచ్చిపోతున్నా ఇంకెక్కడ తొక్కేది తల్లీ! ముగ్గురెక్కితే ముండమొయ్యాల" అన్నాడు.

స్నోలు, సెంట్లుపూసుకుని రంగుల విసనకర్రల మల్లే తిరిగే మీరు, మా రిక్షాలెక్కితే మేం ముండమోసినవాళ్ళంగాక మరెవళ్ళం?—అన్న ధ్వని వినిపించింది.

"ముగ్గుర్నెక్కించుకునేగ్గలమమ్మా? పొద్దుణ్ణుంచి, దమ్మిడీ బోణీ అవనేదు—ఇయ్యాలల్లా పస్తే! ఏనుగు నాటోణ్ణి పీనుగై పోనా! ఒకరోజు బేరాల్లేకపోతే ఏం బతికేది సెప్పమ్మా! ఆడయింట మా ఆడది, ఇద్దరు కుర్రాళ్లు ముసలమ్మ బతకనేక సావనేక పడుతున్నారు"—అన్నాడు రిక్షా.

సావిత్రికి కథ వినడం, విసుగనిపించింది-వెగటనిపించింది. "ఏవిఁటా సోది? ఆ సోది మా దగ్గరెందుకు?" అంది.

ఎవరూ మాటాడలేదు—

తిన్నగా ఇంటి ముంగల రిక్షా ఆగింది. కోటీశ్వర్రావు రిక్షావాడిచేతిలో రూపాయి కాసు పెట్టాడు.

"దర్మప్పెబువులు రచ్చించారు బాబూ, రెన్నాళ్ల గంజికి మొగమోయనక్కరనేదు బాబూ."

రిక్షా చప్పుళ్లు సావిత్రి చెవితెరలు తొలగించినయ్! సావిత్రి ముఖం చిట్లించుకుంటూ, "ఇలా విచ్చలవిడిగా ఖర్చుపెట్టే, నీలాటి వాళ్లకి దేవుడు డబ్బెందుకిస్తాడు? అర్థరూపాయికి బేరమాడుకున్నది రూపాయిచ్చావు. ఏవనుకోవాలి?" అంది.

సుబ్బరామయ్య సమర్థిస్తూ, "అతనెప్పుడూ ఇంతేలే! కన్నూ మిన్నూ తెలీదు. ముసలోళ్లని మాడ్చడం తెలుసు! బీదవారినందరినీ మీ మరది ఉద్ధరిస్తాడులే" అన్నాడు.

కోటీశ్వరరావుకి, అతను చేసినదాంట్లో తప్పు వెదకడం తనలక్ష్యంకాదు. మనదేశంలో సర్వత్రా సామ్యవాదం వర్ధిష్ణువయ్యే అభిప్రాయంగల తను సావిత్రి చర్యనీ, నిరసననీ హర్షించలేదు.

కోటీశ్వర్రావు సామ్యవాద సిద్ధాంతాల్ని ఆమూలాగ్రా చదివి, ఎంతో బాగా అర్థం చేసుకున్నాననుకునేవాడు. అతని ప్రత్యణురక్తి కిరణంలోనూ, సామ్యం గూళ్లుకట్టుకూర్చోకపోయినా, అంతర్వాహినిగా అతనిలో ప్రవహిస్తూంది. అంతేగాని, ఎర్రజండా పట్టుకొని

కమ్యూనిస్టునని కేకలేసుకుంటూ రోడ్లంట పరుగెత్తుకు తిరగలేదు. అందుకే పేదవాళ్లెవళ్లయినా, కష్టాల్లో వున్నామని చెయిచాపితేచాలు వాళ్ల రిక్తహస్తానికి యీడుగా తన రిక్తహస్తాన్ని చాపడు. దానకరణవల్ల బీద స్నేహితులెంత ఎక్కువో, సంస్కారధరణవల్ల ధనిక స్నేహితులూ తనకెక్కువే! అందుకే డబ్బు వెదజల్లి పారవేస్తుంటాడు.

బీదవాళ్లు తన పాదాలముందు డబ్బు ఏరుకోడానికి కలబడుతూ అవనీతలానికి వంగినపుడు మరొక్కడికైతే వాళ్ళ తలల్ని బూట్లకాళ్లతో తన్నాలనిపిస్తుంది!

కోటీశ్వరరావు గది యిప్పుడు పరిశుభ్రంగా ఊడ్చబడి, అన్నీ సర్ది పెట్టి బూజులు దులుపుకొని, చూడ్డానికేమాత్రం అసహ్యం లేకండా వుంది. ఇదంతా సావిత్రి స్వయంహస్తాలతో చేసిందే!

సావిత్రి "మా చెల్లెలొస్తుందోయ్" అంది.

సావిత్రికి చెల్లెలు కూడా వుందా? వుంటే సావిత్రికంటె అందంగా వుండవచ్చు-సావిత్రిలో లోపాలుఆమెలో సద్దుకావచ్చు! ఆమెని వన్నెల వయ్యారాల్లో మించిపోవచ్చు! ఇంతంత కన్నులు చెంపకుచేరెడు మీనాలకుమల్లే, నల్లగలువపూలకు మల్లే, పూర్ణిమారాత్రి రోహిణీ ధ్రువతారలమల్లే- ఇంతపొడుగు జడ కుదుళ్లనుంచి వదులుగా చివర రిబ్బను ముక్కన్నా లేకండా కుచ్చుగా విడిలిపెట్టబడి, అందంగా జఘనసీమలమీద నర్తిస్తూ, ఎంతో సౌందర్యశక్తిని ప్రసరిస్తూ, ప్రసవిస్తూ కన్నులు మిరుమిట్లు గొలుపుతూ వుంటుంది.

తనెక్కడో చదివినట్టు ముచ్చటగా గులాబి మొగ్గలాగ ముద్దులకోసం విచ్చడంకోసముడుచుకొన్న పల్చగా, నిబిడంగాకండా మాధ్యమికంగా ఇంద్రధనుస్సులవంటి పెదవులు —ప్రతిబింబం చూచుకోడానికి వీలుగా చెక్కిళ్లు— "అజంతా కన్య"లా వుండవచ్చు. కోటీశ్వరరావు హృదయం ఇలాంటి సుందరోహాలతో చీలిపోతోంది! సావిత్రి చెల్లెల్ని తనిలా ఎందుకూహించుకుంటాడు? తీరా చూచాక, తన భావసుందరి కాలేకపోతే?...ఆ అమ్మాయిని కన్నెత్తి చూడనన్నా లేదే! కాని, ఆమె మీదికి ఉత్సాహశీలిగా, ఉత్సాహంగా వాళ్ని పారలించడానికి తను చెప్పలేని హేతువేదో వుంది!

రాత్రల్లా, సావిత్రి చెల్లెలిమీద కలలుకాస్తూ, కలతనిద్రల కలవరింతల్లో కనులు మూసీమూయకండా వున్నాడు. ససేమిరా, తల్లిదండ్రులమాట తనకి జ్ఞాపకం వచ్చినా తోసిపారేస్తుంటేనే!

## 5

పళ్లు టకటకలాడించే చలితో భయంకరంగా సావిత్రికి జ్వరం వచ్చేసరికి నిలువునా విరిగిపడిపోయింది. సుబ్బరామయ్య ప్రొద్దుటే బయటికెళ్ళి పోయాడు. దెయ్యం ఆవేశించినట్టు ఒక్కసారి జ్వరం కుదిపేసింది. ఇంట్లో పనిపిల్ల, గదిలో నిద్రపోతూ, కోటీశ్వరావు తప్ప ఎవరూలేరు!

"బాబుగారూ, బాబుగారూ!"అంటూ కేక వేసుకుంటూ, కోటీశ్వర్రావుని లేపింది.

"అమ్మగారు రిసుకుపడిపోనారు బాబయ్యా" కోటీశ్వర్రావు వెళ్లి చూచాడు. ఐదునిమిషాల్లో సైకిలుమీద వెళ్ళి, సుబ్బరామయ్యతో చెప్పి, డాక్టరునితీసుకొచ్చి, చూపాడు.

కోటీశ్వర్రావు ఇల్లుకదలకండా సావిత్రి దగ్గరేకూర్చుని, ఆఫీసుకి సెలవుపెట్టాడు— ఈ లోపులో సుబ్బరామయ్య ఒకసారివచ్చి చూచి వెళ్ళాడు. సావిత్రికి కావలసిన ఉపచారంచేస్తూ "వదినా! ఎంతలో ఎంతవచ్చిందో? పొద్దుట్నుంచీ పిడుగులాంటి నీకే హఠాత్తుగా మలేరియారావడం ఆశ్చర్యంగాదూ? అందుకేనా రాత్రి చలి చంపుతోంది అన్నావ్— ఈదరగాలి తలమోదినట్టుంది" అన్నాడు.

సావిత్రికి జ్వరం తగ్గిపోయేదాకా ఇల్లంతా తనే పుచ్చుకున్నాడు. ఓపిగ్గా అన్నీ చక్కబెడుతూ, అన్నం, కూర, సావిత్రికింత సగ్గుజావ- ఇంతపచ్చడి అన్నీ చేస్తోంటే సావిత్రి ఆశ్చర్యపోయింది. "ఇంత వంటెప్పుడు నేర్చుకున్నావ్" అని.

"బేసిక్ ట్రయినింగులో అన్నీ మేమే చేసుకోవాలి వదినా! ఏదో ఈ వంటకూడా ఒక బ్రహ్మవిద్యేమిటి? అన్నీ చేతిలోవుంటే, కావలసినప్పుడక్కరకొస్తయ్" అన్నాడు.

"పెళ్ళయితే మీ ఆవిడ బదులు నువ్వేవంట చెయ్యొచ్చన్నమాట! అయితే మాచెల్లెలు సుఖ

పడుతుందన్న మాట" అంతనీరసంలోనూ నవ్వుతూ అంది.

కోటేశ్వర్రావుకి ఆ మాటలువినేసరికి ఒక్కసారి వెన్నెలంతాకలిసి తనకి చల్లగా సోకినట్టయింది. కాళిదాసు కవిత్వం చదివిన మహదానందం అతని నాళనాళాల్లో పాకినట్టయింది.

ఈ మాట సావిత్రి నోటివెంట ఎప్పుడూ వినాలనుకోలేదు. అయితే సావిత్రి చెల్లెల్ని గురించి అప్పుడప్పుడు పొగిడేది. ఆ పొగడ్తల్ని తన మనస్సు అగడ్తల్ని దాటనిచ్చేవాడు కాదు.

దసరాకోసం ఎదురుచూస్తోంటే తనెవరికోసమో ఎదురుచూస్తోన్నట్టు భావించాడు.

ఒకనాడు బండిలోంచి దిగుతూన్న ఆ అమ్మాయిని చూచి హఠాత్తుగా నీరయిపోయాడు. అప్పటికి దసరా నాల్గురోజులుంది!

ఆ అమ్మాయి పేరు మీనాక్షి!

తనభావసుందరికీ ఈ మీనాక్షికీ పోలికలు వెదకడానికి కోటేశ్వర్రావు శ్రమపడలేదు.

కోటేశ్వర్రావు మాట్లాడ్డాని కుంకించడంగాని ఆ ప్రయత్న పురస్కారాన్ని గాని, చూపకపోవడంలో తను మంచిపనే చేస్తున్నా అనుకునేవాడు. అందుకు తగ్గట్టుగా మీనాక్షి కోటేశ్వర్రావుని చూసి సౌందర్యాన్ని తొంగలిరెప్పల కిందదాచిపెట్టుకొనేది.

మీనాక్షి రావడంతోనే వదినెకూడా తనతో మాట్లాడ్డం మానివేసింది. అయితే అదెందుచేతనో మానవుడైన కోటేశ్వర్రావు అర్థం చేసుకోబోలేదు. ఇద్దరూ మాట్లాడక పోయేసరికి తనమీద కుట్ర జేస్తున్నారా? అనిపించింది. మరో రోజునకాంప్లిమెంటరీలు తెచ్చి వీళ్ళని కదిలిద్దామా? అనుకొన్నాడు.

అలాగే ఓనాడు తెచ్చి సుబ్బరామయ్య లేకండానే ఇద్దర్నీ తీసుకెళ్ళాడు. సావిత్రికి డ్రింకులవీ యివ్వబోతోంటే వద్దని తోసేసేది. మీనాక్షి అవన్నీ అందిపుచ్చుకుంటూ పిల్లిలా చల్లగా తాగేస్తూ "అంత ఆప్యాయంగా ఆయన తెచ్చియిస్తుంటే వద్దంటే ఆయనమనసెంత కష్టపడుతుంది చెప్పూ" అని కాళీసీసాలు అందించి బిస్కట్లూ, కిళ్ళీలు తెమ్మని పురమాయిస్తూ "మీరు శ్రమిస్తున్నా క్షమించండి" అని పశ్చాత్తాపవాక్యం వదిలి— చిరునవ్వుచిందేది-ఆ చిరునవ్వుకోసమే తనీ నౌకరీ చెయ్యాలనే మీనాక్షి శాసనం కోటేశ్వర్రావు దాటలేక పొయ్యాడు.

మీనాక్షి స్కూలు చదువుల్లో అలవర్చుకున్న సంస్కారం ముచ్చిలిగుంటలో రెండు జడలూ, లిప్‌స్టిక్కూ, సెంటు హెరాయిలూ— ఫారిను వాయిలూ ఆర్కండీ—ఎత్తుమడమల జోళ్ళు-అమెరికన్ గౌనుతో కళ్లు మిరిమిట్లు గొలిపి కుర్రాళ్ళచేత "బర్మాలేడీ" అని సార్థక నామాన్ని సముపార్జించుకొంది.

కోటేశ్వర్రావు మాత్రం ఈ బర్మాలేడీనిచూచి నిలువునా నీరయిపోయాడు. సంస్కృతినీ విజ్ఞానాన్నీ రంగరించుకొని పెదవులమీద పూసుకున్న ఈ"బర్మాలేడీ"కోసం తను విల్లెక్కుపెట్టి పరుగెడతాడా?

ఒక్కొక్కప్పుడుమీనాక్షి తను పలకరిస్తోన్నా పలుకరించకుండా వెళ్ళిపోయేది. నిజంగా అప్పుడతనికి అసహ్యంవేసి, మీనాక్షి నవ్వితే నాగుపాములు బుసకొడుతూన్నట్టుండేది. ఎవరితోనో మాట్లాడుతోంటే తన్ని శపిస్తోన్నట్టుండేది. భూమ్మీద నిలబడకండా ఒక్కసారి కాళ్లు విరుచుకొని గెంతాలనిపించేది. మొహాన్ని కఠిన శిలలకేసి బాదుకొని రక్తంతో ఆమె మొహానికి బొట్లు పెట్టి ఫొటో తీయాలనిపించేది. ఇవన్నీ మనః ప్రకోపాలుగా మాత్రమే. తన్ని ఉడికించేవి!

ఇంత ద్వేషించినా, అసహ్యించినా, మీనాక్షి ఏపనైనా చేసుకురమ్మనేసరికి కాదనకండా పరుగెత్తుకెళ్ళేవాడు. ఓరోజు రాత్రి "అన్నంతినలేదు. కాస్త కాఫీ, ఒకరొట్టి తెచ్చిపెడుదురూ" అనేసరికి ఎంతదూరమైనా లెక్కచెయ్యకండా మైలుదూరందాటి, సినిమాహాళ్ళదగ్గరికెళ్ళి, తిరిగి కాళ్ళీడ్చుకుంటూ వచ్చేవాడు. ఈలోపుగా హోటళ్ళన్నీ కట్టెయ్యటం మీనాక్షి తనని అగ్నిపరీక్షకి నిలబెడుతోందనిపించేది.

ఒక్కొక్కప్పుడు పగళ్లు నిద్రపోతున్నపుడు ఆదివారంరోజుల్లో లేపి, "దారాలయిపోయాయి, నాలుగుబల్లూ రంగురీళ్ళూ, దారప్పీళ్ళూ, తెద్దురూ" అని మీనాక్షి లిస్టురాసిస్తే, అవిపట్టుకొని వెర్రివాడిలా ముఖం వేలాడేసుకుని తను కాదనలేకపోయే బలహీనతల్ని గుర్తించుకొని సిగ్గుపడిపోయేవాడు. మీనాక్షి కోరికల్ని తీర్చడం, తనలో తనకే తెలీని ఏదోస్వార్థం గుడ్డుపెట్టిం

దని అనుకున్నాడు. ఆ శుద్దపుసు చిలికి, పిల్ల బయటపడుతుందో, ఆ ముహూర్తంకోసం వేచి వున్నాడు. తన భక్తికి తనదేవి ఎప్పుడు ప్రత్యక్షమై ప్రణయలాలన కళాలీలంలో దేలిగా జాలిగా ఆడుతూ పాడుతూ, "ప్రథమికిస్ స్వర్గమున కొక్కముడి రచించి" రమ్మని స్వప్నములో కాలికి, తనూ కాంతిస్నిగ్ధచ్ఛటా రేఖికా పథాంతరాలతో, తనలీలా చేలాంచల చలన ప్రణయానుబంధాలతో ముళ్లుపెట్టి కట్టిలాక్కుపోతుంది?

సావిత్రి తన విషయంలో జోక్యం చేసుకోపోవడం తనమంచికే వచ్చిందని సంతోషిస్తూ, మీనాక్షి రెప్పలబరువుల్లో అణగిపోయే సౌందర్య రేఖాసూచికలకి ఆజ్ఞాబద్ధుడై, కనెత్తకుండా ఆమె శాసలాన్ని శిరసావహిస్తున్నాడు.

కోటీశ్వర్రావు మీనాక్షిని అసహ్యంగా ప్రేమిస్తున్నాడంటే ఏ రెంటి అగాధపుటంచులమీద నిలబడ్డాడో, ఆ రెండు కాళ్ళమధ్య మహాగాధ భీకరనిశ్వాసపాతాళాంధకారాలున్నయ్యో తనకేం తెలుస్తుంది? ఏ ఒక్క అంచుమీదనో నిలవాలని తనను కోడంలో అసహజమేముంది? ద్వేష ప్రేమల ప్రభావంగా తను జీవితాన్ని హిమాలయ లోయల్లోకి తోసివేసుకొనేంత మూఢుడై పోతానేమో అని భయపడేవాడు. ఒక అర్ధరాత్రి పన్నెండుగంటలకి చల్లని వెన్నెల నిశీథంలో, తిన్నగా మీనాక్షి దగ్గరి కెళ్ళి, తన ఆశలన్నీ మెలిపెట్టి ఆమెముందు పురివిప్పి, "నిన్నుతప్ప వేరే ఆడవాళ్ళ నెవళ్ళనీ ముట్టుకోను, పెళ్ళి చేసుకోను—తప్పితే నన్ను ఉరికంబం ఎక్కించు" అని ప్రతిజ్ఞ తీసుకొనివచ్చేస్తే! తన నొకవేళ తిరస్కరించినా, సావిత్రి నీడలో తను, మీనాక్షిని ఓడిస్తాడు! అదే అండగా తను అంతర్యుద్ధం సాగించి, సాగించి గెలవలేకపోతే, ఎడారి దారిలో ఎండమావులకోసం, ఆవేశంతో పరుగెత్తుకు పోయిపోయి సొమ్మసిలి మూర్ఛపోతాడు! ఆ మూర్ఛలో తననో భయంకరమైన ద్వేష స్వప్నం, తననీ తన జీవితాన్ని బలి తీసుకుంటుంది.

ధైర్యంచేసి, ఒకనాటి అర్ధరాత్రివేళ మీనాక్షి పక్కదరికి వెళ్ళి ఆమెని లేపాడు—తల చెదరి, పైట చెదరి, చిందరవందరగాపడిపోయిన అందంలా వుంది! మీనాక్షి పూర్తిగా రవికలేకుండా, బాడీ, లంగా దాన్ని చుట్టబెట్టుకొన్న పయిటతో శృంగారదేవత కన్న పిల్లలా వుంది!

కోటీశ్వర్రావు తట్టిన అయిదునిమిషాలకి, బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ, "ఇప్పుడేం కొంప మునిగింది? ఏమయినా తేలు కుట్టిందా? నీ గదిలో పాము దూరిందా?" అంది. ఈమాట లంటుంటే తనకి నిజంగా పాములూ తేళ్ళూ కరుస్తున్నట్టే వుంది!

తను వేసిన పథకం పల్లించడానికి పూనుకున్నాడు. తననుకున్న వాక్యాలన్నీ గొంతుకలోనే ఇగిరిపోయినయ్.

"నిన్నుచూచిన దగ్గర్నుంచీ నావంట్లో మనసులో ఒకరకం రోగం ప్రవేశించింది. అదేమిటో గాని, ఆరోగం నిన్నుచూచే నన్ను నవ్విస్తుంది"

"నిన్ను ప్రేమిస్తే తప్పించి, నిన్ను నేను పెళ్ళి చేసుకోను. నిన్నెప్పుడైనా నేను ఆత్మ వాచాకర్మణా ద్వేషించినా అది ప్రేమయొక్క కామరూపమే."

"ఎక్కడైనా నే నెవరైనా పెళ్ళి చేసుకోబోతోంటే నా పక్కస్థలం నీదే సుమా! నువ్వు గూడా ఇలాగే వుండాలి."

ఇంకరకండావున్న వాక్యాలివి. వీటిని ఆమె ముందు ప్రవేశపెట్టాడు. కొంత స్వతంత్రించి, ఆమె పక్కమీద కూచోబోతుంటే, మీనాక్షి కొంత పక్కకి తొలగనన్నా తొలక్కుండా, "నాపక్కలో పడుకోవాలని సరదాగా వుందా? అయితే తుమ్మముళ్ళ కంపవల్లో పెట్టుకుని, నిద్రోయినట్టే వుంటుంది" అంది.

కోటీశ్వర్రావు తనప్రేమ పారాయణ ముపక్రమించి, తనెన్ని శ్రమలు పడుతున్నాడో వివరిస్తూ మధ్యమధ్య కావ్యోపమానాలూ ఆవీయివీ అన్నీ కలిపి ఆమెని ఊర్వశివన్నాడు, వరూధిని వన్నాడు, భావకవిలా పొగిడాడు. పిచ్చెక్కినట్టు ప్రేమభాగాన్నంతా ఆమెముందు వెళ్ళగ్రక్కాడు. మీనాక్షి అంతా విని, "అయ్యో పాపం! చాలా శ్రమపడ్డారే" అంది.

ఇక కోటీశ్వర్రావు ఆమెని దగ్గరికిలాక్కుంటూ తన ఆశని పెదవులతో ముందుకు తోశాడు—

ఆ త్రోపుకి మీనాక్షి యౌవనమంతా చెదిరింది. పురుషులమీద యిష్టం లేనివాళ్లు చాలా

మంది చేసేటట్టు సాగదీసి కోటీశ్వర్రావు ఎడమ చెంపమీద బలంగా కొట్టింది—

ఆ చెంపపెట్టుతో కోటీశ్వర్రావులో ఇరవై సంవత్సరాల జీవిత సంస్కారాంతర్గత ప్రతిరక్త బిందువుణు పూరకమైన వయసూ, నాగరికత, సంస్కృతి, విజ్ఞానం-అంతర్వ్యాపినీ కల్లోలితమై క్రక్కదలిపోయినయ్! నవనాడులూ క్రుంగిపోయినయ్! ఆమెమీద ద్వేషవిషాన్ని క్రక్కడం మొదలెట్టాడు. కళ్లువిప్పి చూచేసరికి, వెన్నెలంతా ద్వేషంతోనిండిన భయంకరమైన చీకటిగా కనుపించింది. తనువేసే ప్రతి అడుగులో అపశ్రుతి శపిస్తోంది. జీవితం తనముందు నగ్నంగా నర్తించడం మొదలెట్టింది. ఏడుసముద్రాలూ తనొక్కడే, ఆపపోశన పట్టినట్టు గిజగిజ తన్నుకుపోయాడు.

తెల్లవారుతోంటే చిన్నకునుకు వర్షపు చినుకు పడినట్టు పట్టింది. ఆమెచేతి వుంగరపు నాలుగయిదు క్యారెట్ల రాతిదెబ్బ, కఠిన వజ్రఘాతంలా బుగ్గమీద తగిలింది! అది తననుకోకండా మంట లెత్తడం మొదలుపెట్టింది.

మీనాక్షి పొద్దుటే గదిలోకివచ్చి చూచేసరికి కోటీశ్వర్రావు గుర్రుపెట్టి నిద్రపోవడం గమనించి, ముఖానికి సున్నపుబొట్లు పెట్టడం తన పగ పూర్తిగా తీర్చుకోవడానికే! అతనిమీద తనకి పగెందుకు పుట్టాలి? అతని చేయబోయిన పనికి, తనింకా పరాభవిస్తేనేగాని తనకసి తీరేటట్టు లేదు!

అలవోకగా సున్నపుబొట్లు పెట్టి తన పనిమీది వెళ్ళిపోయింది. కోటీశ్వర్రావు గదిలో దిష్టి బొమ్మలా పడుకుని వున్నాడు.

మీనాక్షి, సావిత్రితో "ఆయన్ని లేపవే! ఇంకా మనిషిలా నిద్రపోతున్నాడు" అంది.

సావిత్రి గదిలోకి వెళ్ళి! కోటీశ్వర్రావు ముఖం మీది సున్నపుబొట్లు దిష్టిబొమ్మలకు మల్లే కనిపించినయ్.

లేపి, "అదేమిటి ముఖం అలా వుంది" అంది. కోటీశ్వర్రావు సిగ్గుపడుతూ, "అబ్బే! ఏంలేదు. ఏంలేదు" అద్దం ముందుకువెళ్లి చూసుకొని, "ఏం లేదు వదినా! ముఖం కందితే...స్నోరాశా... అంతే...అంతే..." అన్నాడు.

సావిత్రి నవ్వుతూ, "దానికేంగాని పోన్లే" అని వెళ్లిపోయింది.

మీనాక్షి, "అదేవిటి! మొహంనిండా సున్నం మచ్చలు? అప్పుడే చికిత్స ప్రారంభించావా? త్వరలో నయమవుతుంది పోన్లే" అంటూ వెళ్ళిపోయింది.

కోటీశ్వర్రావుకి వుండుమీద కారంజల్లినా, అంత బాధనిపించదు. ముక్కముక్కలక్రింద చిత్రవధచేసినా తను సహిస్తాడు. కాని మీనాక్షి హాస్యాన్ని విషం మింగినట్టు మింగుతాడు.

ఆరోజు ఆఫీసుకి వెళ్లిన తర్వాత తిరిగి ఇంటికి రావడం మానేశాడు. మరుచటి రోజుకూడా రాకపోవడం అందరికీ చలనం కలిగించింది. సుబ్బరామయ్య సైకిలేసుకుని, ఊరంతా తిరిగి తిరిగి చూశాడు. కాని కోటీశ్వర్రావు జాడలు నీటిలో జాడలే అయినయ్!

మీనాక్షికి మాత్రం ధైర్యం!

"ఎక్కడికి పోతాడే! రాకేం చేస్తాడు? వస్తాడు లే! పెట్టె బేడ ఇక్కడే వుందిగా"

సావిత్రి, "నువ్వేమన్నా అని వుంటావ్, లేకపోతే పిడుగులాంటి మనిషి అలా ఎక్కడ తిరుగుతూ వుంటాడు. నీ సంగతి పిల్లి కళ్లుమూసుకు పాలు తాగినట్టే వుంది—ఎక్కడికి పంపేశావు? చెప్పు" అని, కొంచెం కోపం నటించింది.

మీనాక్షి వెకిలిగా నవ్వుతూ, "కోపంవచ్చింది లే! సున్నపు బొట్లువీ, నేనే పెట్టానని నీ అనుమానం! నేనే పెట్టాననుకో—లేకపోతే అతను చేసిన పనేమిటి?" అంది.

సావిత్రి, "చాల్లే నేర్చుకున్నావు! ఆడదానివి కావూ? ఆమాత్రం సహించుకోవూ? అతనేం తప్పుచేశాడని — అలాంటివాళ్లు నూటికీకోటికీ ఉంటూంటారు. ఇంకా నయం అతను అంతోయింతో బుద్ధిమంతుడుగనక సరిపోయింది! మరో హద్దైతేనా?" అంది.

"మరో హద్దైతే, అట్లకర్ర కాల్చి వాత పెడుదును" అంటూ మీనాక్షి గదిలోకి, గబగబా వెళ్ళిపోయింది.

సుబ్బరామయ్య మీ ఎరగనట్టు, నవ్వుతూ "ఎంతకాలం నుంచేవిటి? నాకేం తెలీదే? మీ చెల్లలు అంత ఉద్దండురాలా?" అన్నాడు.

సావిత్రి ముఖం చిట్లించుకొంటూ, "దెబ్బ

లాడుకున్నట్టున్నారు మాటామటావచ్చి అంతే" అంది.

సుబ్బరామయ్య జరిగినదాన్ని పదిలంగా వూహించుకొంటూ కదిలిపోయాడు.

మధ్యాహ్నం కోటీశ్వర్రావు తండ్రిదగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. రెండురోజుల్లో కొడుకుని చూడ్డానికి వస్తున్నా అని.

ఎవరున్నారని? ఎవరి సంగతి కనుక్కోడానికి వస్తారు?-సుబ్బరామయ్య ఆయనొస్తే, ఏం సమాధానం చెప్పాలో ఆలోచించలేకపోయాడు. కోటీశ్వర్రావు ఇంకా ఇంట్లో అడుగుపెట్టండే!

సుబ్బరామయ్య ఉత్తీవ్రగవేషణా ఫలితంగా సాయంకాలం నాలుగుగంటలకి, కోటీశ్వర్రావుని, చిందరవందరగా తయారైవున్న మనిషిని తీసుకొచ్చి, సావిత్రి కాళ్ళముందు పారవేశాడు.

## 6

సుమారు పదిగంటల దాపున, కోటీశ్వర్రావు తండ్రి వయసుమీరినమనిషి, సుబ్బరామయ్య ఇంట్లో అడుగుపెట్టాడు. ఆఫీసు కెళ్లడానికి, టకప్పైఎ సిద్ధంగావున్న కోటీశ్వర్రావు బయలుదేరబోతోంటే తండ్రి శకునమైంది.

ఒక్కసారి తను ఇంటిదగ్గర తల్లితో, తండ్రితో దెబ్బలాడి వచ్చెయ్యటం, తండ్రి తనని కొట్టబోవటం తల్లి బ్రతిమిలాడ్డం, చంటిపిల్లాణ్ణి కన కాళ్ళముందు పారవేయడం, అన్నీ జ్ఞాపకంగా గిలగిల తన్నుకొచ్చై.

ఈయన ఇక్కడ మళ్ళీ ప్రత్యక్షమవడం, కోటీశ్వర్రావుకి, గుండెలుతీసి తనచేతిలో పెట్టినట్టయింది. ఇంతలో సావిత్రి బయటికొచ్చి, "ఎవరికోసమండీ?"అంది. ముసలాయన సావిత్రిని ఎగాదిగా రెండునిమిషాలు చూస్తూ "నువ్వేనటమ్మా! మా కోడలివి—సుబ్బరామయ్య ఎంత అదృష్టవంతుడు - పెట్టిపుట్టాడు" అని పారాయణం చేస్తూ లోపలికొచ్చాడు.

కోటీశ్వర్రావు "మా నాన్నగారు"అన్నాడు.

"ఏడిశావ్! దొంగ నంగనాచివి, నువ్వు నా కొడుకివీ, నేను నీకు తండ్రినీటరా?" అని ముసలాయన కసిరాడు.

ఈ కసురికి-కోటీశ్వర్రావు బూట్లు టకటకలాడిస్తూ కిందికి దిగిపోవడం—ఎవరూ ఆపుచెయ్యలేదు. సావిత్రి నిర్ఘాంతపడిమాత్రం చూస్తోంది.

ముసలాయన కోటీశ్వర్రావు విషయం వివరంగా, సంగతు లడుగుతూ, "దెబ్బలాడి వచ్చేశాడమ్మాయ్! మే మక్కడ మాడుతోన్నా కానీ పంపడు. కొడుకుమీద బెంగతో అక్కడది కుళ్ళిపోతోందని, ఈ వెధవకిచెప్పినా అర్థమవుతుందా? చూడు డబ్బెలా తగలెడుతున్నాడో - అక్కడున్నప్పుడు ఇజారు గుడ్డలూ-బనీను చొక్కాలు మినహాయించి, వీడి మొహానికి బొచ్చు కోట్లూ, మెళ్ళో గుడ్డ పేలికలూనటమ్మా? నీ కళ్లెదుటి గుండానే డబ్బు తగలెడుతోంటే చూస్తో వూరుకున్నావటమ్మా, గరిటెతో వాతవెయ్యక? సుబ్బరామయ్య కూడా, మాటాడకండా వున్నాడంటే నా ఖర్మంగాక ఏమిటి చెప్పు. అద్దెలేదు గదా, తిండి లేదుగదా! ఈ డబ్బంతా ఎవళ్ళకి తగలెడుతున్నాడని?"

సావిత్రి బిత్తరపడి చూస్తూ "ఏం తగలెయ్యటం లేదే మామయ్యా! అలాంటి బుద్ధిమంతుణ్ణి నే నింతవరకు చూడలేదంటే నమ్మండి" అంది.

"సుబ్బరామయ్యేడీ?"అన్నాడు ముసలాయన

"బజారు కెళ్ళారు. వస్తారు. మధ్యాహ్నం భోజనానికి మీరు లేవండి."

ముసలాయన కంగారు లేదంటూ, మీనాక్షి కేసి చూసి, "ఈ అమ్మాయెవరు? మీ చెల్లెలు కాదుగదా?" అన్నాడు.

"మీనాక్షి-మా చెల్లెలే! ఇంకా పెళ్ళి కాలేదులెండి! మా నాన్నకీ ఓపికతగ్గింది-ఈ కాలంలో ఆడపిల్లల పెళ్ళిళ్లవడానికి పడేకష్టాలు, మీకు చెప్పాలా మావయ్యా?" అంది.

కోటీశ్వర్రావు విషయాలన్నీ గుచ్చిగుచ్చి అడుగుతూ, ఎంత డబ్బొస్తున్నదీ, ఎంత ఖర్చుపెడుతున్నదీ, ఎప్పుడొచ్చేదీ, రాత్రుళ్లు ఎక్కడ పడుకునేదీ—వివరాలన్నీ కనుక్కొంటూ "ఏమయితే నేమిలే అమ్మా! కానీ పంపడుగా" అని విసుక్కున్నాడు.

"మీకు పంపుతున్నానని, మాతో చెప్పాడే" సావిత్రి ఇంతవాడా? అని విస్తుపోయింది.

"అబద్ధం అమ్మాయీ! అబద్ధం! అదే నిజమైతే వాడి బుర్ర నాచేతి కర్రతో బద్దలుగొట్టి, నే కొట్టుకచస్తాను."

"అయితే అబ్బాయిని తీసుకెళుతారా?" అని సావిత్రి అడిగింది.

వచ్చినా తీసుకెళ్ళేది లేదని చెపుతూ "ఎక్కడో ఒకచోట సుఖంగా నాలుగు రాళ్లు తెచ్చుకుంటున్నాడు. అదే నాకు చాలు! పదికాలాలకీ వాడి బాగే కదమ్మా మేం కోరేది? ఒకయింటివాడైతే చూడాలనుంది."

"దానికేవండీ! చూడాలని అందరికీవుంటుంది. ఘటన కలిసిరావాలిగాని."

"కాని ఆ భాగ్యం మాకు లేదమ్మోయ్! ఘోటకబ్రహ్మచారిలా తిరుగుతాననీ, పెళ్ళీ పెడాకులూ అక్కర్లేదని భీష్మించి కూర్చుంటే ఎవరేం చేస్తారు?"

"అదిగో, ఆ మీనాక్షినే మీ కోడలుకింద చేసుకుంటే, మా కభ్యంతరా లుండవు" అంది సావిత్రి మీనాక్షిని వ్రేలికొసతో నిర్దేశిస్తూ.

మీనాక్షి కోపంతో చూస్తూ, "పెళ్ళిట పెళ్లి నేనెవళ్లనీ పెళ్ళి చేసుకోను. నీ కయింది చాలదూ? నీ అనుభవంతో నాకు కడుపు నిండిపోయింది" అని ఖుసగొడుతూ లోపలికి పారిపోయింది.

"పెళ్లక్కర లేదన్నా ఇద్దరికీ పెళ్ళి చేసుకొనేందుకు ప్రమాదా లుండవనుకుంటా" అంది సావిత్రి నవ్వుతూ.

ముసలాయన, ముడతలుపడిన ముఖాన్ని ఆ నవ్వు అమృతంలా స్పర్శిస్తూ, ముడతలు విడదీసింది.

సుబ్బరామయ్య వచ్చి ముసలాయన్ని పలకరించాడు.

కన్నీళ్లు పెట్టుకుంటూ "వెధన స్వార్థంతో వాడిమీద కొండంత ఆశలు పెట్టుకొని, ఈ వృద్ధాప్యంలో అయినా, ఓమూల పడుకుని వయోవిశ్రాంతి తీసుకుందా మనుకుంటే-నాకా రాత లేదురా నాయనా! సుఖమూ, శాంతి అనే మాటలకే తావులేకండా పోయింది. ఇంతకీ వాణ్ణనేం లాభం? వాడికిప్పుడు శుక్ర మహాదశలో రాహువు అంతర్దశ. వాణ్ణిలా ఏడిపిస్తాడు. తల్లికీ తండ్రికీ బిడ్డనించి ఎడబాపులు. ఎంత బుద్ధిమంతుడైతేమాత్రం, అంగట్లో అన్నీ వున్నయ్, అల్లుడినోట్లో శనివున్నట్టు తెలీటంలేదూ? ఇల్లంతా గోలపెట్టి, నేనే ఏదో అంటే పౌరుషపడి, తల్లినీ పిల్లల్నీ కాలితో తన్నేసి ఇలా నీపంచ పడున్నాడు. నీకూ నాకూ సంబంధం లేదన్నాడు. ఇంకా అవాచ్యపు మాటలెన్నింటికో నన్ను బాధ్యుణ్ణిచేసి, ఇంట్లో తుఫాను వదలిపెట్టి ఇక ఇక్కడ నిశ్చింతగా వున్నాడు. ఇక్కడే వుంటున్నాడని ఎవరోచెపితే కన్నకడుపు గనుక పరుగెత్తుకొచ్చాను. "నాన్నా వచ్చావా?" అని అని వుంటే నేనెంత తేలికపడుదును? వెధవవేషం వేసుకుని, ముఖం అటు తిప్పుకొని పోయాడురా! చూడు ఎంత బరితెగించిపోయాడో? నేనంటే అంత లక్ష్యం లేనప్పుడు వాడంటే నాకెందుకుండాలి?"

"దానిబాధ దానిది. అక్కడ తల్లి బెంగటిల్లిపోయి, రేపో మాపో అన్నట్టుంది. ఇన్ని రోగాలతో రొచ్చులతో నిముషం శాంతిలేనిమాకు, జీవితంమీద జీవించాలని ఎలావుంటుంది? ఎంత బుద్ధిమంతుడైతే మాత్రం మాకేం లాభం చెప్పు నాయనా?"

సుబ్బరామయ్య వింటూ అలాగే కూర్చున్నాడు. ముసలాయన ధోరణిలో, "అయినకొడుకున్నాడు. ఆడపిల్లల పెళ్లిళ్లు నే చెయ్యకండా పోయినా, వాడు చేస్తాడనే ఆశపడ్డాను. అందుకే వాడు పెళ్ళి మానేసి చెల్లెలి పెళ్ళిళ్ళూ, అప్పీచేసి బరువు దించుకుని తను మానేమావేస్తానని ధైర్యం చెప్పాడు. ఇప్పుడా మాటలే గాలిలోవున్నాయో? ఇల్లంతా వుద్ధరిస్తాడు వంశాన్నుద్ధరిస్తాడు. కుటుంబాన్నంతా అవలీలగా గట్టుకి చేరుస్తాడనే గొంతెమ్మ కోరికలు కోరుకున్నందు కిదీ ఫలితం"- ముసలాయన కడుపులో గుండె కరిగి, కళ్లు వత్తుకున్నాడు.

సావిత్రి అందుకుంటూ "ముందు అబ్బాయి పెళ్ళి తలపెట్టండి. పెళ్ళయితే ఇంటి కాపునే పడివుంటాడు. దానితో మీ కోరికలన్నీ తీరుతయ్" అంది.

సుబ్బరామయ్య మీనాక్షీ ఏడుస్తూన్న ముసలాయన ముఖం చూడలేక పక్కకి తిరిగారు.

కోటీశ్వర్రావు సాయంత్రంగాని, రాత్రిగాని రాలేదు. మర్నాడు కూడా రాకపోవడం ముసలాయన్ని మూలనుంచి లేపింది.

"అలా తిరిగి వస్తానమ్మా! ఉండబట్టడం లేదు! ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో ఏమిటో?" అని

కాళ్ళకి చెప్పులూ, గొడుగూగిడుగూ ఏమీలేకండా కొడుకోసం బయల్దేరి వెడుతోంటే మీనాక్షి "ఈయనకి పిచ్చా ఏవిటి?" అంది.

సావిత్రి కళ్ళల్లో ఎక్కడో ఒక చిన్న మేఘం లాంటిది కమ్ముకుంది. ముసలాయన వెడుతోన్నంత సేపూ దిగాలుపడి నుంచుంది.

ఇదివర కెన్నడూ తిరక్కపోయినా, యెక్కడెక్కడున్నాడో వుంటాడో వెతుక్కుంటూ కలెక్టరాఫీసు కెళ్ళాడు—ఆఫీసు సెలవు-తిరిగితిరిగి మాడుకుంటూ, నాలుగు గంటలకి తిరిగివచ్చాడు, ఎండలో, ధూళిలో, గాడ్పుల్లో మరిగి, అతని శక్తినంతనీ పంచభూతులు పంచుకోగా, నీరసం హైన్యం దైన్యం బరువుగా మోసుకొంటూ వచ్చి కూలిపోయాడు.ఆసొమ్మ సిలిపడిపోవడం, సావిత్రి ఉపచారాలకిగాని, మేలుకోలేదు.

సావిత్రి ప్రశ్నించకండా, "విశ్రాంతి తీసుకోండి బాబుగారూ! అనవసరంగా తిరిగి, తిరిగి వచ్చారు" అంది.

"ఎడారిలాంటి జీవితంలో ఎండమావులేగాని నిజమైన నీళ్ళకోసం, బయల్దేరడం ఎంత ప్రయాసమ్మా!" అంటూ ముసలాయన దిగాలుపడి పడుకున్నాడు.

"ఎవరికైనా అంతే లెండి మామగారూ! మా వాళ్ళు మా అయిదుగురి ఆడపిల్లలకీ పెళ్ళిళ్లు చేయడానికి ఎన్ని కష్టాలు పడ్డారు మాయింటో ఏవంత పెద్ద దీపం వుందని ఇంకా ఈ మీనాక్షికి పెళ్ళి కానేలేదు——దాని చదువూ దాన్ని చూస్తే నా కప్పుడప్పుడు భయంకూడా వేస్తుంది" అంది సావిత్రి ముసలాయన స్థితికి జాలిపడుతూ.

ఇంతలో బయట బండి చప్పుడువిని, సావిత్రి వీధిలోకెళ్ళి చూచింది. తన తండ్రి దిగుతూన్న జాడల్ని చూస్తూ, ఉద్వేగ్తుగా వుప్పొంగిపోతోన్న ఆనందంతో వెర్రికేకవేస్తూ "నాన్నా నాన్నా ఇంత హఠాత్తుగా దిగావు" అంది.

సావిత్రి తండ్రి, "లేదమ్మా! అలాగే రావాలి సొచ్చింది. అరేయ్! బండి ఈ మనిషిని సాయం తీసుకురారా" అన్నాడు.

సావిత్రి, బండివాడి సాయంతో అతన్నెవరోన్ని ఒక జబ్బుమనిషిని, నీరసంగా కళ్లు లోతుకు దించుకుపోయి, నల్లగా బూజుపట్టినట్టు గెడ్డం పెరిగిపోయిన మనిషిని దింపడం చూచింది. రెండునిమిషాల్లో అతన్ని లోపలికి తీసుకొచ్చారు.

"ఆఁ! ఇతను మీకెక్కడ దొరికాడు?" అంది సావిత్రి హఠాత్తుగా.

సావిత్రి తండ్రి ఆశ్చర్యపోతూ, "ఆఁ నేననుకున్నట్టే అయింది. అప్పుడే దారిలో సావిత్రి సావిత్రీ అనీ మీనాక్షీ అనీ ఒకటే పలవరింతలూ, కలవరింతలూ—వి శా ఖ ప ట్నం స్టేషన్లో పడివున్నాడు. ఫలానా వూరని చెపితే ఇక్కడికి తీసుకొచ్చాను. ఇదంతా మన మేలుకే జరిగింది. సన్నాసుల్లో పడివుంటే, ఇతణ్ణి చూచిన తండ్రి ఎంత మొత్తుకుంటాడు?" అన్నాడు.

ముసలాయనవచ్చి కొడుకుస్థితిని చూసి, మీదపడి బావురుమని ఏడ్చాడు.

కోటీశ్వర్రావు సాయంకాలానికి బాగాకోలుకున్నాడు. మందూ, కాఫీ, బత్తాయి రసంతాగి నీరసంగాలేస్తూ, సావిత్రి ముఖంలోకిచూస్తూ "వదినా! తల్లితండ్రిమాటవినని, వాడికిలాంటి గతి పట్టాలని నువ్వు శపించు. ఆ శాపం నేను భరిస్తాను" అన్నాడు.

సావిత్రి తండ్రి "గోసాయి మఠాధికారివై పోదామనుకొన్న నీకు శాపాలెందుకు? నువ్వే ఒకళ్ళని శపిస్తావ్" అన్నాడు. సావిత్రి "ఁ అస్థిరవ్యక్తి ఎలాంటివాడో నీకు నేరుగా కనిపిస్తున్నాడుగా! ఇలాంటివాడికి మీనాక్షినివ్వాలని నీకెలా తోస్తుందో నాకు తెలీటం లేదు" అంది.

తండ్రి చిరునవ్వునవ్వుతూ "అంతలోనే వుందమ్మాయ్! ఇలాంటివాళ్ళందరికీ మీనాక్షుల్నే పెళ్ళిచెయ్యాలి. ముక్కుకీ మూతికీ తాడువేసి బంధించేసి, కొంగులుచేతికిచ్చి తిరగమంటారు. మీ మరిదికి మొత్తానికి ఉద్దండురాల్నే కట్టబెడుతున్నావ్" అన్నాడు.

మీనాక్షి ఎర్రని ముఖం కందగడ్డంతయింది. ముఖం పువ్వులా ముడుచుకుంటూ కోటీశ్వర్రావు ముఖంమీద నీరసంగా మొలిచిన చిరునవ్వుని వివరించి "మతిలేదేమిటి మీకు?" అంది. మూతి ముడిచింది. ముఖం ప్రక్కకి తిప్పుకొని సుందర జఘనసీమలమీద వ్రేలుతోన్న జడని చూసింది. చేతులగాజుల గలగలలతో చెవుల చెవుణ్ణి వదలగొట్టింది. కోటీశ్వర్రావు "ఈమెని నేను ప్రేమిస్తున్నానా? ద్వేషిస్తున్నానా?" అని అనుమానించాడు.